క్లుప్తంగా

బోనాల పండగకు కలెక్టర్‌కు ఆహ్వానం


కలెక్టర్‌కు అందజేస్తున్న నరేశ్

జగిత్యాల: మేదిని లలిత కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించనున్న తెలంగాణ బోనాల పండగ కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు నిర్వాహకుడు నరేశ్ బుధవారం ఆహ్వానపత్రిక అందజేశారు. బోనాల నృత్యాలుంటాయని, ప్రతీ ఒక్కరు పాల్గొనాలన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం


ఆర్థికసాయం అందిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గతనెలలో పూడూరు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డు ఇమ్రానోద్దీన్‌కు పోలీసు అధికారులు, సిబ్బంది వైద్య ఖర్చుల కోసం సేకరించిన రూ.1.30 లక్షల నగదును బుధవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమ్రానోద్దీన్ కుటుంబానికి పోలీసు శాఖ తరుపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. నిత్యం విధులు నిర్వహించే పోలీసులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి


వినతిపత్రం అందిస్తున్న శ్యామ్‌సుందర్

జగిత్యాల: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ బుధవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఉండి అవసరం ఉన్న చోట ఉపాధ్యాయులను కేటాయించాలని, బదిలీ సమయంలో జరిగిన సాంకేతిక సమస్యలతో నష్టపోయిన వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. లెఫ్ట్ ఓవర్ వెకెన్సీస్ అర్హత గల ఉపాధ్యాయులతో ప్రమోషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, వొజ్జ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన ఎంపీపీ,జెడ్పీటీసీ


విప్‌కు జ్ఞాపిక ఇస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

ధర్మపురి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుగ్గారం జెడ్పీటీసీ, ఎంపీపీలు బాదినేని రాజేందర్, రాజమణి బుధవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, నాయకులు ముస్కు నిశాంత్‌రెడ్డి, వెంకటేశ్వర రావు ఉన్నారు.

నిధుల మళ్లింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన నిధులు పక్క గ్రామంలో పనిచేసే కార్యదర్శి పేరు మీదికి మళ్లింపు జరిగాయని , దీనిలో మండలస్థాయి అధికారుల ప్రమేయం ఉందని దీనిపై విచారణ జరపాలని సారంగాపూర్‌కు చెందిన న్యాయవాది మానాల వెంకటరమణ బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెంబట్ల గ్రామానికి చెందిన నిధులు రూ.81,450, రూ. 76,849, రూ. 2,65,888 మొత్తం మూడు విడతల్లో సారంగాపూర్ పంచాయతీ కార్యదర్శి పేరుకు బదలాయింపు జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా పలు గ్రామాల్లో నిధులు మళ్లింపు జరిగిందని, వీటిపై కలెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరారు.

పొంచి ఉన్న ముంపు ముప్పు

- రహదారి ఎత్తుగా ఉండడంతోనే సమస్య
- వానాకాలం వస్తుందంటే భయం భయం..
- ప్రధాన రహదారికి ఇరువైపులా ఇళ్ల జనం ఆందోళన


ఇంట్లో చేరిన నీటిని ఎత్తిపోస్తున్న మహిళ (ఫైల్)


ఇళ్లలోకి వచ్చిన వరదనీరు(ఫైల్)

బుగ్గారం: వానాకాలం వస్తుందంటే మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఇళ్లలోని ప్రజలు భయంగా భయంగా గడపాల్సిన పరిస్థితి. ఎప్పుడు తమ ఇళ్ల ముందు వరదనీరు వచ్చి చేరుతుందో,ఎప్పుడు ఇళ్లలోకి నీరు వస్తుందోనని వర్షాకాలం అంతా ఆందోళనతో గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి అధికారులు, ప్రజాప్రతినిధుల ముందుచూపులేని తనమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎత్తురోడ్డుతోనే సమస్య..

నూతన మండలంగా ఏర్పాడ్డాక మండలంలోని పలురోడ్లు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి సైతం చాలా ఇరుకుగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో మండలంలోని వివిధ గ్రామాల మధ్య గల పలు రోడ్లను అభివృద్ధి చేశారు. మండల కేంద్రం గుండా వెళ్లే ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా మార్చారు. అయితే దీని నిర్మాణంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందుచూపు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల ప్రజలు ప్రతీ వానాకాలం ఆందోళనతో గడపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం పరిధిలో సుమారు కిలోమీటరుకు పైగా డబుల్ రోడ్డుగా మార్చారు. దీంతో గ్రామరూపురేఖలు మారిపోయినప్పటికీ రోడ్డును బాగా ఎత్తుగా నిర్మించడంతో తాము ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

డబుల్ రోడ్డును, దానికి ఆనుకుని ఇరువైపులా నిర్మించిన మురుగుకాల్వ నిబంధనలకు విరుద్ధంగా ఉందని పలువురు స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. రోడ్డు నిర్మాణ సమయంలో తామంతా ఆందోళన చేసినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదని వాపోయారు. నూతన రోడ్డును నిర్మించేటప్పుడు పాత రోడ్డును పూర్తిగా తవ్వాల్సి ఉండగా పైపొరలను మాత్రమే తొలగించి నూతన రోడ్డును నిర్మించారని ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణంలోనూ నాణ్యతాప్రమాణాలు పాటించలేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే పలుచోట్ల ప్రధాన రహదారితో పాటూ మురుగుకాల్వ,రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ దెబ్బతిన్నాయని, దీనికి నాణ్యతాలోపమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..



ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే బుగ్గారంలో ప్రధాన రహదారి నిర్మాణం అస్తవ్యస్తంగా జరిగింది.దీంతో ఈ రోడ్డును ఆనుకుని ఉన్న వారంతా వానాకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సుమారు 200 వందలకు పైగా ఇళ్ల ప్రజలు వానాకాలంలో వచ్చేచేరే వరదనీటితో ఇబ్బందిపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.

– చుక్క గంగారెడ్డి, వీడీసీ చైర్మన్,బుగ్గారం

ఇళ్లల్లోకి వరదనీరు



వానాకాలం వచ్చిందంటే మాకు నిత్యం ఆందోళననే. వర్షం బాగా కురిసినప్పుడు వరదనీరు ఇంటిలోకి వస్తుంది.తాత్కాలికంగా ఎన్ని జాగ్రత్తలు పాటించినా ఇబ్బందులు తప్పడం లేదు. కొంత మందైతే తమ సమీపంలోని నీటిని తోడిపోయడానికి గతంలో మోటార్లు సైతం ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– అక్బర్,బుగ్గారం

పేదింటి ఆడబిడ్డల కోసమే 'కల్యాణలక్ష్మి'

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు కష్టం కావొద్దనే మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మెట్‌పల్లి మండలంలో పలు గ్రామాల్లో లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ చేసిన అభివృద్ధి,సంక్షేమం కళ్ల ముందే కనిపిస్తుందన్నారు. అనంతరం మెట్లచిట్టాపూర్‌లో పీఏసీఎస్ గోదాంను ప్రారంభించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిరెడ్డి,తిరుపతి, రాజాగౌడ్,శ్రీధర్,గంగాధర్,ప్రతాప్‌రెడ్డి,రాజారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలుస్తాయి

కోరుట్ల రూరల్: అధికారంలో ఉన్నపుడు ప్రజలకు మనం చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలుస్తాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. పదవులు శాశ్వతం కాదని పదవిలో ఉన్నపుడు ప్రజలకు మనం చేసిన మంచి పనులే శాశ్వతంగా నిలుస్తాయన్నారు.అనంతరం పదవీ కాలం ముగుస్తున్న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలను అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ నారాయణ, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం జగిత్యాలలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ బి.సత్యప్రసాద్‌ను కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడికి వినతి

గొల్లపల్లి: దళితుల పట్ల కొనసాగుతున్న వివక్షతను నిర్మూలించేందుకు ప్రభుత్వ విధానాలు, పథకాల అర్హతలలో మార్పులు చేయాలని కోరుతూ బుధవారం జగిత్యాలకు వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌కు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం కార్యనిర్వహక సభ్యుడు నల్ల శ్యామ్‌తో పాటు, పలువురు మండల నాయకులు వినతిపత్రం అందజేశారు.

దళిత సంఘాల నాయకులు..

మేడిపల్లి: ఎస్సీ,ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో భీమారం, మేడిపల్లి మండలాల దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్,బంగారు దీపక్, రవి, శేఖర్, మహేశం పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్లటౌన్: రాష్ట్రంలో మైనార్టీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ముస్లిం మైనార్టీ రైట్స్ సంస్థ అధ్యక్షుడు మొహ్మద్ ముజాహిద్ అన్నారు. కోరుట్లలో బుధవారం మాట్లాడారు. 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ముస్లింలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు తప్ప సంక్షేమం పట్టని కేసీఆర్ పదేళ్ల ప్రభుత్వంకు బుద్ధి చెప్పామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో 6 నెలలు గడిచిన మైనార్టీ శాఖకు మంత్రి లేకపోవడం విడ్డూరమని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిఅన్వర్ సిద్దిఖీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

జగిత్యాలరూరల్: అంతర్జాతీయ ప్లాస్టిక్ బాగ్ ఫ్రీ డే సందర్భంగా జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి శ్రీవిద్య పాఠశాలలో గ్రామస్తులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలు ర్యాలీగా వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలతో జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటరమణ, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన గుట్ట సత్యనారాయణ, ఉపాధ్యాయురాలు ఉమారాణిలను బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పాఠశాలకు వారు చేసిన అభివృద్ధి, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దొంతి నాగరాజు, మాజీ సర్పంచ్ స్వప్న, విద్యా కమిటీ చైర్మన్ మానస, మాజీ ఎంపీటీసీ ఉడుత రవీందర్, నేతాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్: దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు, శిక్షలు అమల్లోకి వచ్చాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో ప్రజలకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, ఏవో లావణ్య, ప్యాక్స్ సీఈవో భూమేష్, నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాల గురించి మహిళలు తెలుసుకోవాలి

జగిత్యాల: చట్టాల గురించి మహిళలు తెలుసుకోవాలని సాధికారత కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. బుధవారం మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భారతీయ న్యాయ సన్నిహితలో భాగంగా వైష్ణవి కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన చట్టాల గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే మహిళ హెల్ప్ లైన్ 181, సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి

ఇబ్రహీంపట్నం : మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దీపిక రైతులకు సూచించారు. బుధవారం మండలకేంద్రంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మగ రెక్కల పురుగుల ఉధృతిని తగ్గించుకోవడానికి ఆలాగే కాండం సుడుల్లో ఉన్న పురుగును నివారించడానికి ఎలాంటి క్రిమిసంహార మందులు వాడాల్లో రైతులకు సూచించారు. ఒక శాతం సున్నం, 9శాతం ఇసుక కలిపి ఎకరానికి 10 కిలోలు మొక్క కాండం సుడుల్లో పడునట్లుగా వేయాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో హరీశ్, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఫెస్టిసైడ్స్ విక్రయిస్తే చర్యలు

మల్లాపూర్: అనుమతి లేకుండా రైతులకు ఫెస్టిసైడ్స్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి లావణ్య హెచ్చరించారు. బుధవారం మల్లాపూర్, సిరిపూర్‌లో సహకార సంఘం, ఫర్టిలైజర్ షాపులను వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట వెంట ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుభరోసాకు పరిమితులు విధించాలి

మల్లాపూర్: రైతు భరోసాకి పరిమితులు విధించాలని, 5 ఎకరాల వరకే పెట్టుబడి సాయం అందించాలని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పలువురు రైతులు 10 ఎకరాల వరకు ఇవ్వాలని, ఎక్కువ మంది రైతులు 5 ఎకరాలకే పరిమితం చేయాలని అన్నారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించాలని ప్యాక్స్ చైర్మన్ నర్సారెడ్డి, రైతులు ఏవో లావణ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ సిద్దిక్ అలీ, సీఈవో భూమేశ్, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో వీడీసీ ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పులతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో వీడీసీ సభ్యులు,కుల సంఘాలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధించాం


సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

పెగడపల్లి: సమష్టి కృషి, అన్ని శాఖల అధికారుల సహకారంతోనే మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎంపీపీ గోలి శోభ, జెడ్పీటీసీ రాజేందర్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని గ్రామాలభివృద్ధికి కృషి చేశామని పేర్కొన్నారు. ఇందుకు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు సహకరించినందుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు వీడ్కోలు

రాయికల్: ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగియడంతో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు చిరంజీవి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటా

ఇబ్రహీంపట్నం: గోధూర్ గ్రామస్తులకు రుణపడి ఉంటానని ఎంపీపీ జాజాల భీమేశ్వరి అన్నారు. ఎంపీపీ పదవి గురువారంతో ముగుస్తుండటంతో బుధవారం మండలంలోని గోధూర్‌లో ఎంపీపీ జాజాల భీమేశ్వరిని వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు ఎడపెల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోటగిరి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి


నిల్వ నీటిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం పలు కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయని, నీరు ఎప్పటికప్పుడు తరలించేలా చూడాలని కార్మికులను ఆదేశించారు. అలాగే నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేయాలని తెలిపారు. ప్రజలు సైతం సహకరించాలని, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం వేయకుండా స్థల యజమానులే చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లవ్వ, శానిటరి ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

శుద్ధిచేసిన నీటినే తాగాలి

వర్షాకాలంలో ప్రతి ఒక్కరు శుద్ధిచేసిన నీటినే తాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం ఫిల్టర్‌బెడ్ వద్ద నీటి శుద్ధిచేసే ప్రక్రియను పరిశీలించి వాటిని తాగి పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలంలో నీటిని ఎప్పటికప్పుడు నీటిని క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట డీఈ యాదగిరి, ఏఈ అనిల్, వాటర్ సప్లై సిబ్బంది ఉన్నారు.

నిరుపేద విద్యార్థినికి ప్రభుత్వ విప్ ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామానికి చెందిన ఆయిల్నేని నవ్య అనే నిరుపేద విద్యార్థినికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ. 25 వేలు బుధవారం ఆర్థికసాయం అందించారు. నవ్య తండ్రి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. నవ్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ఫస్ఇయర్ చదువుతోంది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.డీ అజీమ్, గడ్డం అరుణ్, ఎగ్యారపు శ్రీహరి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పెగడపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థినుల్లో అవగాహన ఉండాలని ఎస్సై జాడి రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో బుధవారం సైబర్ నేరాలు, సైబర్ మోసాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కొత్తగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ఎస్సై వివరించారు. ప్రత్యేక అధికారి సునిత, టీచర్లు పాల్గొన్నారు.

రైతు భరోసాపై సమావేశం

ధర్మపురి: ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎకరాలతో సంబంధం లేకుండా మొత్తం భూమికి రైతు భరోసా ఇవ్వాలని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సహకార సంఘం అధికారి రామ్మోహన్,సంఘం అధికారి రాము, సీఈవో రాజేష్, సభ్యులు తదితరులున్నారు.

వృద్ధురాలు అదృశ్యం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు(50) అదృశ్యమైనట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వృద్ధురాలు ఇంటి నుంచి రెండు రోజుల క్రితం వెళ్లిపోయి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో వాకాబు చేశారు. అయినప్పటికి ఆచూకి లభించలేదని పోలీసులు పేర్కొన్నారు. వృద్ధురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ చెప్పారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ధర్మపురి: ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాలలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 1977 ఎస్ఎస్‌సి మిత్రబృందం వారి ఆధ్వర్యంలో సుమారు 15 వేల రూ.ల విలువ గల నోటు పుస్తకాలను బుధవారం పంపిణీ చేసారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాపర్తి విజయలక్ష్మి, మిత్రబృందం సభ్యులు నరేందర్, శంకర్‌శర్మ, కిషన్ తదితరులున్నారు.

ఆత్మీయ సన్మానం

జగిత్యాలరూరల్: మండలంలోని నర్సింగాపూర్ ఉన్నత పాఠశాలలో 13 ఏళ్లుగా పనిచేసి బదిలీపై వెళ్లిన గంగమోహన్, రవికుమార్ అనే ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంఘ భవనం ప్రారంభం

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని స్థానిక ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక బుధవారం ప్రారంభించారు.

జువ్వాడి తల్లికి పలువురి నివాళి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్

ధర్మపురి: కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తల్లి జువ్వాడి సుమతి ప్రథమ వర్థంతిని మండలంలోని తిమ్మాపూర్‌లో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

రాయికల్: ఇటిక్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన సాయిరిషిత్, చందనగిరి స్ఫూర్తి, భూపతిపూర్ గ్రామంలోని ఏళ్ల నవ్య అనే విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ బుధవారం తెలిపారు.

సారంగాపూర్: బీర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన గుండా నందిని, వేదశ్రీ అనే ఇద్దరు విద్యార్థినులకు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సంగెనభట్ల నర్సింహ్మమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

కథలాపూర్: మండకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పదో తరగతి పూర్తిచేసిన సిరికొండకు చెందిన బద్దం పల్లవి అనే విద్యార్థినికి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు ప్రిన్సిపాల్ నరేశ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

'ప్రోటోకాల్ విస్మరించిన ఎమ్మెల్యే'

కోరుట్ల: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రోటోకాల్ పాటించలేదని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం కోరుట్లలో మాట్లాడారు. గ్రామాల్లో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆ గ్రామ ఎంపీటీసీకి తెలకుండానే చెక్కులు పంపిణీ చేయటం సరికాదన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం బుధవారంతో ముగుస్తున్నప్పటికీ అంతకుముందు కూడా ప్రోటోకాల్ పాటించ లేదన్నారు. దీనిపై కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశానన్నారు.

ప్రీ స్కూల్ పుస్తకం షెడ్యూల్ అమలు చేయాలి

మల్యాల: అంగన్‌వాడీ టీచర్లు ప్రీ స్కూల్ పుస్తకం షెడ్యూల్‌ను నిత్యం అమలు చేయాలని ఐసీడీఎస్ మల్యాల ప్రాజెక్టు అధికారి నర్సింగరాణి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు పవిత్ర, సుధారాణి, ఉమ, రాధిక, లత, నీలిమ, శంకరమ్మలను సీడీపీవో నర్సింగరాణి సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజశ్రీ, మమత, సుభద్ర, మహేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.